క్లుప్తంగా

నగర ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు



డాబాగార్డెన్స్: నగర ప్రజలకు మాజీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. వినాయకుడిని పూజిస్తే సకల కార్యాలు సిద్ధిస్తాయని, నగర ప్రజలు భక్తి శ్రద్ధలతో ఈ వినాయక చవితిని పర్యావరణ హితంగా జరుపుకోవాలని ఆమె ఆకాంక్షించారు.

నిరాశ్రయులకు ఉచితంగా హెయిర్ కటింగ్



నిరాశ్రయులకు హెయిర్ కటింగ్ చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

అల్లిపురం: జీవీఎంసీ ఏయూటీడీ వసతి గృహంలో బుధవారం మదర్ థెరిసా జయంతి సందర్భంగా రామకృష్ణ సోషల్ సర్వీసెస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరాశ్రయ వసతిగృహంలో ఆశ్రయం పొందుతున్న వారికి ఉచితంగా హెయిర్ కటింగ్ చేశారు. జీవీఎంసీ ఏయూటీడీ స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో షెల్టర్‌లో ఉన్న 60 మంది మహిళలు, పురుషులకు ఉచిత హెయిర్ కటింగ్ చేసినట్లు సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. ఈ సేవా కార్యక్రమంలో మల్లువలస రాధాకృష్ణ, కూర్మాపు ధనంజయరావు, కుమార కొండబాబు, జామి బంగారు బాబు, కింతాడ కోటేశ్వరరావు, ఆతవ సముద్రము, ధనుష్ ఏయూటీడీ సిబ్బంది జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మట్టి వినాయక ప్రతిమలతో ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు, విద్యార్థులు తదితరులు

అల్లిపురం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మిసెస్ ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రి నాయుడు అన్నారు. కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను తయారు చేసి కళాశాలలో మంగళవారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, స్వరాజ్యలక్ష్మి, ఇంగ్లీష్ విభాగాధిపతి పైడి రజని అర్చన, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ బయోపిక్ 'అర్జున్ చక్రవర్తి'



సందడి చేసిన సినిమా యూనిట్

డాబాగార్డెన్స్: కబడ్డీ క్రీడాకారుడి జీవితంపై ఆధారపడిన వాస్తవగాథ 'అర్జున్ చక్రవర్తి' ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర బృందం మంగళవారం నగరంలో ఓ హోటల్‌లో విలేకరులతో మాట్లాడింది. అర్జున్ చక్రవర్తి కేవలం ఒక సినిమా కాదు, ఇది నా తొమ్మిదేళ్ల కష్టం. కబడ్డీ చాంపియన్ జీవితంపై దర్శకుడు విక్రాంత్ రుద్ర ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారని హీరో విజయరామరాజు అన్నారు. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందన్నారు. ఇప్పటికే మంచి స్పందన వస్తుందని అన్నారు. ఇప్పటికే ఈ సినిమా 46 అంతర్జాతీయ ఫిల్మ్ అవార్డులు గెలుచుకుందన్నారు. నిర్మాతా శ్రీని గుబ్బల, నటుడు దయానంద రెడ్డి (పుష్ప-2 ఫేమ్), హీరోయిన్ సిజా రోజ్, దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

మహారాణిపేట సీఐ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ దివాకర్

అల్లిపురం: మహారాణిపేట సీఐగా జి.దివాకర్ వాయునందన యాదవ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల అదుపునకు కృషి చేస్తానని తెలిపారు. ఈ స్థానంలో ఇప్పటి వరకు విధులు నిర్వర్తించిన బాసిన భాస్కరరావును, సిటీ వీఆర్-1కు అటాచ్ చేస్తూ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సోమవారం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే.

చవితికి అల్పపీడనం తాకిడి

- వర్షంలోనే మండపాల ఏర్పాటు
- తడుస్తూనే పూజా సామగ్రి విక్రయాలు
- లబోదిబోమంటున్న నిర్వాహకులు.. చిరువ్యాపారులు



బౌడారా రోడ్డులో వర్షంలోనే వినాయక మండపాలు ఏర్పాటు చేస్తున్న యువకులు



పోలీస్ బ్యారెక్స్ వద్ద వర్షంలోనే వినాయక ప్రతిమల విక్రయాలు

డాబాగార్డెన్స్: వినాయక చవితి వస్తుందంటే సుమారు నెల రోజులుగా హడివిడి కనిపిస్తుంది. గణనాథుని బొమ్మలు వివిధ రూపాల్లో ఆర్డర్ ఇచ్చి తయారు చేయించడం, పందిళ్లు వేయడం, మండపాలు అలంకరించడంలో నిమగ్నమవుతుంటారు యువత. అందరికంటే విభిన్నంగా మండపాలు అలంకరించి ఆకర్షణగా నిలిపేందుకు రాత్రింబవళ్లు కష్టపడతారు. నియోజకవర్గంలో నెల రోజులుగా వినాయక చవితి సందడిలో తలమునకలైన నిర్వాహకులకు అల్పపీడనం దెబ్బకొట్టింది. సోమవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేని వర్షం నిర్వాహకులకు మండపాలు ఏర్పాటు చేయడానికి ఆటంకంగా మారింది. బుధవారం తెల్లవారితే చవితికి మండపాలు సిద్ధం చేయాల్సి ఉంది. దాని కోసం నిర్వాహకులు హడావిడి చేస్తుండగా మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం పొద్దుపోయే వరకు వర్షం కురవడంతో ఇబ్బంది పడ్డారు. అప్పటికే మండపాల కోసం వేసిన పందిళ్లు నానిపోయాయి. కర్రలపై కప్పిన టార్పాలిన్లు వర్షంతో పాటు వీస్తున్న గాలికి ఎగిరిపోయాయి. మండపాలకు అలంకరణ చేయడానికి సైతం వర్షం ఆటంకంగా నిలిచింది. రంగులతో అలంకరించిన మండపాలు కళ తప్పాయి. వర్షం ధాటికి అలంకరణ చేయలేక ఎక్కువ మండపాలను బోసిగా వదిలేశారు. బుధవారం వర్షం లేకపోతే పూజా కార్యక్రమాలు ముగిసిన తర్వాత అయినా మండపాలను అలంకరించుకోవచ్చంటూ కొందరు నిర్వాహకులు నిర్ణయించుకున్నారు. నియోజకవర్గంలో జగదాంబ, మహారాణిపేట, దిబ్బలపాలెం, ఆంథోనీనగర్, రామజోగిపేట, అల్లిపురం, కొబ్బరితోట, రామకృష్ణావీధి, చిలకపేట, పాతపోస్టాఫీస్, ఫెర్రీరోడ్డు, కోటవీధి, మట్టా వెంకటప్పవీధి, చెంగల్రావుపేట, జబ్బర్‌తోట, రెల్లివీధి, కృష్ణానగర్, పూర్ణామార్కెట్, పందుంపుల్లల సందు, వెలంపేట, ప్రసాద్‌గార్డెన్స్, పండావీధి, కల్లుపాకలు, సాలిపేట, కుమ్మరవీధి, ఏవీఎన్ కాలేజీ డౌన్, రంగిరీజు వీధి, తాడి వీధి, దండుబజార్, వెంకటేశ్వరనగర్, బుద్ధవరపు గార్డెన్స్, జిల్లా పరిషత్ జంక్షన్, నౌరోజీరోడ్డు, పందిమెట్ట, ఊటగెడ్డ, వెంకటపతిరాజునగర్ తదితర ప్రాంతాల్లో సుమారు 300కు పైగా వినాయక మండపాలు ఏర్పాటు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆయా మండపాలు అన్నింటికీ వరుణడు ఆటంకంగా మారాడు. మండపాల ముందు విద్యుత్ దీపాల అలంకరణ కూడా సరిగా చేయలేకపోయారు. వర్షం దెబ్బకు వినాయక చవితి సందడి లేకుండా పోయిందంటూ నిర్వాహకులు లబోదిబోమంటున్నారు.

చిరు వ్యాపారులు వెతలు..

వర్షం కారణంగా చిరు వ్యాపారాలు వెలవెలబోయాయి. వినియోగదారులు లేక దుకాణాలు బోసిపోయాయి. పూర్ణామార్కెట్, కురుపాం మార్కెట్, అల్లిపురం బజార్, రామకృష్ణా రైతు మార్కెట్, చెంగల్రావుపేట, దండుబజార్ తదితర ప్రాంతాలలో ఎక్కడ చూసినా చిరు వ్యాపారులు రోడ్డు పక్కన తోపుడు బళ్లపై పెట్టి వినాయక ప్రతిమలు, పూజాపత్రి, మొక్క జొన్న పొత్తులు, జామ కాయలు, వెలగ కాయలు తదితర వాటితో పాటు వినాయక వ్రతానికి సంబంధించిన పూజా సామగ్రిని విక్రయానికి సిద్ధం చేశారు. ఎడతెరిపి లేని వర్షం కారణంగా ఆయా దుకాణాలలో సామగ్రి కోసం వెళ్లే వినియోగదారుల రద్దీ తగ్గిపోయింది. ఫలితంగా దుకాణాలు వెలవెలబోయాయి. చవితికి లాభాలు వస్తాయనుకునే చిరు వ్యాపారులు పెట్టుబడి కూడా వస్తుందో లేదోనంటూ లబోదిబోమంటున్నారు.

పూలకు రెక్కలు..

వినాయక చవితి సందర్భంగా పూలు, టింకాయల ధరలు పెరిగిపోయాయి. రెండు రోజుల వరకు కిలో రూ. 200 నుంచి రూ. 250 వరకు ఉండే పలు రకాల పూల ధరలు రెట్టింపయ్యాయి. చవితి కారణంగా వినాయకుడికి మండపాలతో పాటు ఇళ్ల వద్ద పూలు వినియోగించడంతో వాటి ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. రైతు బజార్లలో సోమ, మంగళవారాల్లో గులాబీలు, చామంతి, బంతి పూలు మిక్సింగ్ 100 గ్రాములు రూ.50, కిలో రూ.500 చొప్పున విక్రయించారు. వీటితో పాటు దాలియా పువ్వు ఒకటి రూ. 10, కలువ పువ్వు ఒకటి రూ.20 చొప్పున విక్రయించారు. వీటికి తోడు ప్రతి ఒక్కరు వినాయుడి వద్ద ముఖ్యంగా వినియోగించే టింకాయి సైజులను బట్టి రూ.35, రూ. 40, రూ. 50 చొప్పున విక్రయించారు.

పోటెత్తిన పూర్ణామార్కెట్

- వాన వెలిసాక జోరందుకున్న వ్యాపారాలు
- జోరుగా పూజా సామగ్రి కొనుగోళ్లు



కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయిన పూర్ణామార్కెట్

జగదాంబ: వినాయక చవితికి పూర్ణామార్కెట్ కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయింది. సోమవారం నుంచి మంగళవారం సాయంత్రం వరకు తెరిపివ్వని వాన ఆ తర్వాత ఆగడంతో అటు వ్యాపారులు ఇటు కొనుగోలుదారులతో మార్కెట్ కిటకిటలాడింది. వినియోగదారులు పూజా సామగ్రి కొనుగోలుకు పోటెత్తారు. ధరలు ఆకాశాన్ని అంటినా తప్పనిసరి పరిస్థితుల్లో సామగ్రి కొనుగోలు చేశారు.



పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు

సందడిగా అల్లిపురం మార్కెట్

- వర్షంలోనే పూజా సామగ్రి విక్రయం
- పెరిగిన ధరలతో ప్రజల ఇబ్బందులు



అల్లిపురం మెయిన్‌రోడ్డులో వర్షంలోనే పత్రి, పండ్లు, పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న భక్తులు

అల్లిపురం: మార్కెట్లు చవితి సందడి సంతరించుకున్నాయి. ఒకప్పుడు రూ.10 విలువ చేసే పత్రి రూ.50కి విక్రయిస్తున్నారు. 21 రకాల పండ్లు ముఖ్యంగా యలంకాయ, మారేడు కాయ, కొబ్బరి పువ్వు ఇతర పండ్ల ధరలు పెరిగిపోయాయి. అరటి ఆకులు ఒకటి రూ.5 నుంచి రూ.10, డజను అరటి పండ్లు రూ.80 నుంచి రూ.120, కొబ్బరికాయ రూ.30 నుంచి రూ.40కు అమ్మకాలు జరిపారు. రంగు రంగుల వినాయక బొమ్మలు కనువిందు చేయటంతో చిన్నారులు ఏ బొమ్మ కొనాలో అన్న మీమాంసలో పడిపోయారు. కొనుగోలు దారులతో అల్లిపురం కుమ్మరివీధి కళకళలాడింది.

నేటి నుంచి నవరాత్రులు ప్రారంభం

నిర్వాహకులు నిబంధనలు పాటించాల్సిందే



అల్లిపురం మెయిన్‌రోడ్డులో ముస్తాబవుతున్న గణపతి ఆలయం



నీలమ్మవేపచెట్టు అమ్మవారి దేవస్థానం రోడ్డులో ఏర్పాటు చేసిన మండపం

అల్లిపురం: వినాయక చవితి ఉత్సవాలకు నగరం సిద్ధమయింది. బుధవారం నుంచి తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. అల్లిపురం నేరెళ్లకోనేరు జంక్షన్‌లో ఐదు దశాబ్దాలుగా వేడుకలు చేపడుతున్నారు. నీలమ్మ వేపచెట్టు ప్రాంతంలో శ్రీ గణపతి నీలమాంబ అసోసియేషన్ ఆధ్వర్యంలో విభిన్న రూపాల్లో గణపతిని ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నిబంధనలు తప్పనిసరి..



గణపతి ఉత్సవాలు నిర్వహించే వారు నిబంధనలు పాటించాల్సిందే. పోలీస్ కమిషనర్, జీవీఎంసీ అధికారులు సూచించిన విధంగా మండపాల వద్ద ఏర్పాట్లు చేసుకోవాలి. వేదికల వద్ద పోలీస్, ఫైర్ ఫోన్ నంబర్లు ఏర్పాటు చేయాలి. డీజేలు ఉపయోగించరాదు. భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలు చేపట్టాలి. అధిగమించిన వారిపై చర్యలు తప్పవు. –వీవీసీఎం ఎర్రంనాయుడు, టూటౌన్ సీఐ

మహిళల భద్రతపై విద్యార్థినులకు అవగాహన



మాట్లాడుతున్న మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ రూప

డాబాగార్డెన్స్: మహిళలకు ఏదైనా సమస్య ఎదురైనప్పుడు 100కు కాల్ చేస్తే నిమిషాల వ్యవధిలోనే సహాయం అందుతుందని రిటైర్డ్ ఆదాయపు పన్ను కమిషనర్ వడ్డాది అప్పలరాజు పేర్కొన్నారు. అలయన్స్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ఆవరణలో సింహాద్రి టీఎంటీ, విశాఖ సిటీ మహిళా పోలీస్ స్టేషన్ సంయుక్తంగా మంగళవారం మహిళల భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో విలువైనదన్నారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో చదివిస్తున్నారని, వారి ఆశలు వమ్ము చేయొద్దని కోరారు. మహిళల భద్రతపై అనేక చట్టాలు, పథకాలు, నివారణ చర్యలు అమల్లో ఉన్నాయని, ప్రభుత్వ చట్టాలతో పాటు మహిళలు తమ భద్రత కోసం జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైతే పోలీసులకు కాల్ చేయడం, ఒంటరిగా వెళ్లకుండా కుటుంబ సభ్యులతో వెళ్తుండాలన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే అప్రమత్తమై పోలీసులకు కాల్ చేయడానికి వెనుకాడకూడదని, డయల్ 100కు కాల్ చేస్తే నిమిషాల వ్యవధిలో సహాయం అందుతుందన్నారు. మహిళా పోలీస్ స్టేషన్ ఎస్సై యు.రూప మాట్లాడుతూ అమ్మాయిలు జాగ్రత్తగా ఉండాలని, మీ చుట్టే మానవ రూపంలో కీచకులు ఉంటారని, అవసరమైతే తల్లిదండ్రులకు చెప్పాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిత్యం ఎక్కడో చోట మహిళలపై లైంగికదాడులు జరుగుతున్న సంఘటనలు చూస్తూనే ఉన్నామని, నెలలు నిండని పసికందులు, యువతులు, ఇంటి వద్దనే ఉంటున్న వృద్ధులు.. ఇలా వయసుతో సంబంధం లేకుండా విచక్షణ మరచి మనిషి రూపంలో ఉన్న మృగాళ్లు అఘాయిత్యాలకు పాల్పడతున్నారని చెప్పారు. ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టాగామ్, యూట్యూబ్ తదితర సామాజిక మాధ్యమాల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కందుకూరి శ్రీనివాసరెడ్డి, ఎంఎస్ కుమారి, మళ్ల అప్పలరాజు, అలయన్స్ కాలేజీ హోటల్ మేనేజ్‌మెంట్ చైర్మన్ కొల్లా సతీష్‌కుమార్, డాక్టర్ బీఏఎస్ నంద, ఆర్.కిరీటికుమార్, ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, హిమా హ్యూమానిటేరియన్ వ్యవస్థాపక కార్యదర్శి టీవీడీ దాస్ తదితరులు పాల్గొన్నారు.

బాబు మోసాలను విస్తృతంగా ప్రచారం చేయండి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కోడిగుడ్ల శ్రీధర్

కంచరపాలెం: బాబు మోసాల గురించి ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు తెలియచేయాలని జీవీఎంసీ 41వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ కార్యకర్తలకు సూచించారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ నేతృత్వంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీపై కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చెప్పిందొకటి చేస్తుందొకటి అని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీల కంటే అదనంగా ప్రజలకు సంక్షేమాన్ని అందించిందని గుర్తు చేశారు. ఎన్నికల ముందు చంద్రబాబు వెన్నుపోటు రాజకీయాలతో సంక్షేమాన్ని రెట్టింపు ఇస్తామని ప్రజలకు ఆశ చూపి గద్దెనెక్కారన్నారు. పేదలు సంతోషంగా ఉండాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాలనే చైతన్యాన్ని ప్రజల్లో తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మత్స్య దృష్టి నౌక పునఃప్రారంభం



వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న వివిధ విభాగాల అధికారులు

మహారాణిపేట: భారతీయ మత్స్య పరిశోధనా సంస్థ 80వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మంగళవారం హార్బర్ జెట్టీ వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశోధనా నౌక ఎం.ఎ ఫ్.వి. మత్స్య దృష్టిని లాంగ్ లైనింగ్ సర్వే కోసం పునఃప్రారంభించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి భారతీయ మత్స్య పరిశోధనా సంస్థ డైరెక్టర్ జనరల్ కె.ఆర్. శ్రీనాథ్ మాట్లాడుతూ భారత మత్స్య రంగానికి ఈ సంస్థ అందిస్తున్న సేవలను కొనియాడారు. భవిష్యత్తులోనూ మత్స్య రంగం అభివృద్ధిలో ఈ సంస్థ కీలక పాత్ర పోషించే అవకాశం ఉందని ఆయన అన్నారు. కార్యక్రమంలో ముంబై ప్రధాన కార్యాలయం, చెన్నై, విశాఖపట్నం బేస్‌ల నుంచి అధికారులు పాల్గొన్నారు.

మెరైన్ సైన్సెస్‌పై వర్క్ షాపు



మాట్లాడుతున్న జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ లక్ష్మణరావు

మహారాణిపేట: మెరైన్ సెన్సెస్ 2025 వర్క్‌షాప్ మంగళవారం ఫిషింగ్ హార్బర్ దగ్గరున్న సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చి ఇనిస్టిట్యూట్ (సీఎంఎఫ్ఆర్ఐ) కార్యాలయంలో డాక్టర్ జోయి కిజకుద్దీన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో సర్వే విధి విధానాలు, తీరప్రాంత మత్స్యకార గ్రామాలు, ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలు, మౌలిక సదుపాయలు, వసతులు, బోట్లు, వలలపై ఎన్యూమరేటర్స్ సహాయంతో సర్వే నిర్వహించి గణాంకాలు తయారు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జేడీ లక్ష్మణరావు మెరైన్ సైన్సెన్ గురించి వివరించారు. కోనసీమ జేడీ శ్రీనివాసరావు, శ్రీకాకుళం డీడీ సత్యనారాయణ, అనకాపల్లి, విజయనగరం డీడీలు విజయ, విజయకృష్ణతో పాటు 12 జిల్లాల అధికారులు, సీఎంఎఫ్ఆర్ఐ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మణి, డాక్టర్ ముక్తా తదితరులు పాల్గొన్నారు.

వినాయక ప్రతిమల పంపిణీ



మట్టి వినాయక విగ్రహాలు అందజేస్తున్న పచ్చిరిపల్లి రాము, రమేష్ తదితరులు



వినాయక ప్రతిమలు అందజేస్తున్న జైపూర్ సంస్థానం రాజమాత మయాంక కుమారిదేవ్



మట్టి వినాయక ప్రతిమలు అందజేస్తున్న డాక్టర్ పీవీ రమణమూర్తి

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు పచ్చిరిపల్లి రాము ఆధ్వర్యంలో అల్లిపురం మెయిన్ రోడ్డు వద్దనున్న శ్రీ వరసిద్ధి వినాయకుని గుడి వద్ద వినాయక చవితి సందర్భంగా మట్టి విగ్రహాల పంపిణీ మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో 500 వినాయక ప్రతిమలు భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమం లో 33వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మాదబత్తుల రమేష్, అల్లం నాగేశ్వరావు, సూర్య, పి.వి.ఎస్. రెడ్డి, పి. నానాజీ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మట్టి ప్రతిమలే శ్రేష్టం..

డాబాగార్డెన్స్: రాంనగర్ మెయిన్‌రోడ్డు రాఘవేంద్ర స్వామి గుడి పక్కన న్యూ భారత్ సప్లయర్స్ ప్రాంగణం వద్ద న్యూభారత్ సేవా సంస్థ అధినేత చిట్లూరి గిరిధర్ సారథ్యంలో 20వ సారి 3 వేల మట్టి వినాయక ప్రతిమలు, వినాయక వ్రతకల్పం పుస్తకాలు, పూల మొక్కలు భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని జైపూర్ సంస్థానం రాజమాత మయాంక కుమారిదేవ్ ప్రారంభించారు. అనంతరం జైపూర్ రాణి మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించే దిశగా, సాంప్రదాయాన్ని పాటిస్తూ మట్టి వినాయక ప్రతిమలు పూజించడం శ్రేష్టమన్నారు. కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, నందిక శ్రీనివాసరెడ్డి, సంస్థ ప్రతినిధులు సీహెచ్ విజయలక్ష్మి, సీహెచ్ అదేష్‌రాజా, శరగడం రాము తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద సంస్థ ఆధ్వర్యంలో..

కళా ఆస్పత్రి అధినేత డాక్టర్ పీవీ రమణమూర్తి ఆర్థిక సహాయంతో మంగళవారం పాతనగరంలోని స్వామి వివేకానంద సంస్థ వద్ద డాక్టర్ పీవీ రమణమూర్తి మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సభ్యులు కోటేశ్వరరావు, సత్తిబాబు, మహిళా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీలో ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినుల ప్రతిభ



ఎన్‌సీసీ క్యాడెట్లను అభినందిస్తున్న డాక్టర్ మంజుల, డాక్టర్ గీతాంజలి

అల్లిపురం: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థినులు బి.లావణ్య, ఎం.దివ్య సికింద్రాబాద్‌లో ఈనెల 10 నుంచి 24వ తేదీ వరకు జరిగిన ఆర్మీ అటాచ్‌మెంట్ క్యాంపులో ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపులో క్యాడెట్లు ఆయుధాల వినియోగం, మిలిటరీ ఆచార వ్యవహారాలు, డ్రిల్, ఫిజికల్ ఫిట్‌నెస్ వంటి అంశాలలో శిక్షణ పొందినట్లు తెలిపారు. ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ కె. గీతాంజలితో కలిసిన విద్యార్థినులను అభినందించారు.

మర్యాదపూర్వక కలయిక



వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లితో అదీప్‌రాజ్

డాబాగార్డెన్స్ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్‌ను పార్టీ రాష్ట్ర యువజన విభాగం జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మంగళవారం ఆశీల్‌మెట్టలోని వాసుపల్లి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. దక్షిణ నియోజకవర్గానికి సంబంధించి యూత్ కమిటీ నివేదిక అందజేయాలని కోరారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న వారిని గుర్తించి, యూత్ కమిటీలో చేర్చనున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో యువతకు ఉద్యోగావకాశాలు కల్పించి, సముచిత స్థానం కల్పించిన జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనకు చంద్రబాబు చేస్తున్న అరాచక పాలనకు వ్యత్యాసం చూపాలన్నారు. మళ్లీ వైఎస్సార్‌సీపీని అఖండ మెజార్టీతో అధికారంలోకి తీసుకు వచ్చి, జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పని చేయలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంబటి శైలేష్, నాగిరెడ్డి కిరణ్, బొడ్డేపల్లి హేమంత్, వేపాడ శ్రీనివాస్, జతిన్, మువ్వల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.